క్లుప్తంగా

మధుమేహాన్ని ముందే గుర్తిస్తే మంచిది



సిరిసిల్ల పాత బస్టాండులో రక్త పరీక్షలు చేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

సిరిసిల్ల/సిరిసిల్ల అర్బన్: మధుమేహాన్ని ముందే గుర్తిస్తే అదుపులో పెట్టుకోవడం సులభమవుతుందని డాక్టర్ దోర్నాల శ్యాంసుందర్ రెడ్డి అన్నారు. డయాబెటిక్ మాసం సందర్భంగా సిరిసిల్ల పాత బస్టాండులో శనివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత రక్త పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. ఆరు సంవత్సరాలుగా మధుమేహ మాసంలో ఉచిత శిబిరాలు నిర్వహించి ప్రజలను చైతన్యవంతులను చేస్తున్నామని పీడీజీ అనంతుల శివప్రసాద్ అన్నారు. బచ్చు భానుచందర్, నగునూరి శ్రీకాంత్, చొప్పదండి ప్రమోద్, పల్లం అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

ఇల్లంతకుంట: పంచాయతీ కార్యాలయ ఆవరణలో శనివారం శరత్ మాక్స్‌విజన్ కంటి ఆసుపత్రి వారు ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఇల్లంతకుంట గ్రామ ప్రజలు కంటి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కంటి సమస్యలపై అవగాహన కల్పించారు. కార్యదర్శి వరుణ్, వైద్య సిబ్బంది దిలీప్, హర్షవర్దన్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం మహాసభల కరపత్రాలు ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

బోయినపల్లి: జిల్లా కేంద్రంలో ఈనెల 19, 20ల్లో జరిగే సీపీఎం మహాసభలను విజయవంతం చేయాలని రూపొందించిన కరపత్రాలను నీలోజిపల్లి గ్రామంలో శనివారం మండల నాయకులు ఆవిష్కరించారు. మండల కన్వీనర్ గురజాల శ్రీధర్, గ్రామ శాఖ కార్యదర్శి ఎర్ర నాగరాజు, సింగిరెడ్డి శంకర్, అనుముల రవి, ఆవుల మల్లయ్య, కడుదుల రవి తదితరులున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

కోనరావుపేట: వెంకట్రావుపేట గ్రామానికి చెందిన వులిసె ప్రమీల, దాసరి దివ్య, ఉప్పుల నారాయణకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరయిన చెక్కులను మాజీ ఎంపీటీసీ పల్లె మంజుల రవీందర్‌రెడ్డి, కాంగ్రెస్ అధ్యక్షుడు జొగ్రీగ వెంకటేశం అందజేశారు. మంతెన నరేశ్, నాలిక వేణు, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహారెడ్డి, లింగయ్య, మల్లయ్య తదితరులున్నారు.

మొక్కలు పంపిణీ



ఎల్లారెడ్డిపేటలో మొక్కలు పంపిణీ చేస్తున్న రమేశ్

ఎల్లారెడ్డిపేట: నారాయణపూర్‌కు చెందిన పర్యావరణ పరిరక్షకుడు దుంపెన రమేశ్ శనివారం మండల కేంద్రంలో పలువురికి మొక్కలు పంపిణీ చేశారు. ఉసిరి, జామ, దానిమ్మ, గన్నేరు, మందార, మల్లె, మైదాకు తదితర 480 మొక్కలను అందజేశారు.

పశువు చనిపోయింది.. సాయం చేయండి



పశువును చూపిస్తున్న రైతు గోపి

తంగళ్లపల్లి: మండల కేంద్రానికి చెందిన రైతు చక్రాల గోపికి చెందిన పశువు శనివారం ఆకస్మికంగా మరణించింది. దీంతో రైతు కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. గోపి మాట్లాడుతూ.. ఒక వ్యక్తి వద్ద డబ్బులు అప్పుగా తీసుకోగా అతడు వారం రోజుల క్రితం బర్రెను తీసుకుపోయాడని, అప్పటి నుంచి మేత మేయకపోవడం, నీరు తాగకపోవడంతో బర్రె చనిపోయిందన్నాడు. బర్రె మృతిపై అనుమానముందని అన్నాడు. తగిన న్యాయం చేయాలని నష్ట పరిహారం ఇప్పించాలని కోరాడు.

బ్రహ్మోత్సవాలకు వేళాయే

- నేటి నుంచి వేణుగోపాలుడి ఉత్సవాలు
- ఆరు జిల్లాల నుంచి భక్తుల రాక
- ఏర్పాట్లు చేసిన ఆలయ కమిటీ
- పెద్ద రథానికి రంగులు
- జాతరకు ముందే వెలిసిన దుకాణాలు
- ఆకట్టుకోనున్న ఎగ్జిబిషన్

ఆధ్యాత్మికం

ఎల్లారెడ్డిపేట: శ్రీవేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలకు వేళైంది. కార్తీక మాసం పురస్కరించుకొని స్వామివారి ఉత్సవాలను నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతుండగా.. స్వామిని దర్శించుకొని పునీతులు కావడానికి సమయాత్తమవుతున్నారు భక్తులు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయం ఆధ్వర్యంలో కార్తీక మాసంలో నిర్వహించే బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా పూర్తి చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ వైభవాన్ని తిలకించడానికి ఆరు జిల్లాల నుంచి భక్తులు హాజరు కానున్నారు. భక్తుల సంఖ్యకనుగుణంగా ఆలయ కమిటీ సభ్యులు ఆ స్థాయిలో ఏర్పాట్లు చేశారు. 6 రోజులపాటు నిర్వహించే బ్రహ్మోత్సవాలను తిలకించడానికి భక్తులు ఏడాది మొత్తం ఈ మాసం కోసం ఎదురుచూస్తారు. ఎల్లారెడ్డిపేటలో ఈనెల 10 ఆదివారం నుంచి 15 శుక్రవారం వరకు కార్తీక పౌర్ణమి బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తారు. ఇందులో ప్రధానంగా గ్రామంలో పెద్ద రథం తిరగడం, చివరగా మహా జాతరతో బ్రహ్మోత్సవాలు ముగిసినట్లు వేద పండితులు ప్రకటిస్తారు.

కార్యక్రమాలిలా..

శ్రీవేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం ఆలయ సంప్రోక్షణతో పండితులు ప్రారంభిస్తారు. 11, 12న సాధారణ పూజలుండగా.. 13 నుంచి ముఖ్య ఘట్టం ప్రారంభం కానుంది. 13న ఉదయం 10 గంటలకు స్వామివారి ఎదుర్కోళ్లతో ముఖ్య కార్యక్రమాలు మొదలవుతాయి. ఉదయం 11 గంటలకు శ్రీరుక్మిణి-సత్యభామ సమేత వేణుగోపాలస్వామివారి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించనున్నారు. రాత్రి అశ్వ వాహనంపై స్వామివారి ఊరేగింపు ఉంటుంది. 14న సుదర్శన నరసింహ వాహనంపై స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తారు. 15న మరో ముఖ్య ఘట్టమైన స్వామివారి పెద్ద రథాన్ని గ్రామ పుర వీధుల గుండా ఊరేగిస్తారు. గరుడ వాహనంపై స్వామివారిని గ్రామ పుర వీధుల గుండా ఊరేగిస్తారు. రాత్రి



సంప్రోక్షణ పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

కార్తీక మాసం జాతర నిర్వహిస్తారు. రాత్రి 11.30 గంటలకు స్వామివారి ఏకాంత సేవతో బ్రహ్మోత్సవాలు ముగిసినట్లు వేద పండితులు వెల్లడిస్తారు.

ఆరు జిల్లాల నుంచి..

ఈ బ్రహ్మోత్సవాలకు ప్రాధాన్యముంది. హైదరాబాద్, కామారెడ్డి, సిద్దిపేట, కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల జిల్లాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. 14, 15ల్లో మాత్రం ఆరు జిల్లాలకు చెందిన భక్తులు ఎక్కువగా హాజరవుతారు. వివిధ తండాల నుంచి గిరిజనులు జాతరకు పెద్ద సంఖ్యలో వస్తారు. బ్రహ్మోత్సవాలకు ముందుగానే సమీపంలో ఎగ్జిబిషన్‌కు సంబంధించిన యంత్రాలు ఏర్పాటయ్యాయి. సర్కాస్‌లను తలదన్నే తరహాలో జాయింట్ వీల్(రంగుల రాట్నం) లాంటి అనేక రకాల చిన్న పిల్లలు ఆడుకునే పరికరాలను ఏర్పాటు చేశారు. ఉత్సవాలకు వారం ముందు నుంచే వివిధ రకాల ఆట వస్తువులు, మిఠాయి దుకాణాలు వెలిశాయి.

పోలీసుల కన్ను..

గత బ్రహ్మోత్సవాలకు ముందు ఆలయ కమిటీ పాలకవర్గాన్ని మార్చడంతో.. పాత, ప్రస్తుత నూతన కమిటీల మధ్య అభిప్రాయ బేధాలు చోటుచేసుకున్నాయి. ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించడానికి పోలీసులు అన్ని చర్యలు చేపట్టారు. ఉత్సవాలు ముగిసేవరకు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



రంగులతో పెద్ద రథం ముస్తాబు

మంత్రికి ఆహ్వానం



పొన్నంకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని కోరుతూ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కు ఆలయ కమిటీ సభ్యులు శనివారం ఆహ్వాన పత్రిక అందజేశారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను కూడా కలిసి అందజేశారు. చైర్మన్ గడ్డం జితేందర్, వైస్ చైర్మన్ గంట వెంకటేశ్‌గౌడ్, నాయకులు సంతోష్‌గౌడ్, చెన్ని బాబు ఉన్నారు.

అన్ని ఏర్పాట్లు చేశాం



బ్రహ్మోత్సవాలకు అన్ని రకాల ఏర్పాట్లు చేశాం. భక్తులు అధిక సంఖ్యలో రానుండడంతో అదేస్థాయిలో ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. ఈసారి గ్రామస్తులందరి సహకారంతో వేడుకలను వైభవంగా పూర్తి చేస్తాం.

– గడ్డం జితేందర్, ఆలయ కమిటీ చైర్మన్

ప్రశాంతంగా జరుపుకోవాలి



బ్రహ్మోత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తాం. ఉత్సవాలపై పోలీసుల దృష్టి ఉంటుంది. జాతరకు ప్రత్యేకంగా సిబ్బందిని నియమిస్తాం. గ్రామస్తులు సహకరించాలి.

– శ్రీనివాస్‌గౌడ్, సీఐ, ఎల్లారెడ్డిపేట

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే



వేములవాడఅర్బన్: రుద్రవరంలో సర్వే చేస్తున్న అధికారులు



గంభీరావుపేట: సముద్రలింగాపూర్‌లో సర్వే చేస్తున్న అధికారులు

వేములవాడఅర్బన్: వేములవాడ మండలంలోని అన్ని గ్రామాల్లో సమగ్ర ఇంటింటి కుటుంబ(సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల) సర్వే శనివారం ప్రారంభించారు. అధికారులు ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరించారు. 155 ఇళ్లలో సర్వే నిర్వహించినట్లు తెలిపారు. ఎంపీడీవో రాజీవ్ మల్హోత్ర, మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్ తదితరులున్నారు.

వేములవాడరూరల్: మండలంలోని పలు గ్రామాల్లో అధికారులు 224 కుటుంబాల సర్వే చేపట్టారు. వివరాలు నమోదు చేశారు. 62 మంది సిబ్బంది పాల్గొన్నారు. ఏఎస్‌వో రవళి, మండల నోడల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముస్తాబాద్: సర్వేతో తెలంగాణలో సంక్షేమ పథకాల అమలు సులభతరమవుతుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి అన్నారు. ముస్తాబాద్‌లో కుటుంబ సర్వేను ప్రత్యేకాధికారి లత శనివారం ప్రారంభించారు. తహసీల్దార్ సురేశ్, ఎంపీడీవో బీరయ్య, ఈవో రమేశ్, శ్రీనివాస్‌గౌడ్, వుచ్చిడి బాల్‌రెడ్డి, భాను తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వం చేపట్టిన ఆర్థిక, సామాజిక, విద్య, ఉపాధి, కుల గణనకు అన్ని వర్గాల ప్రజలు సహకరించి విజయవంతం చేయాలని తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు తెర్లుమద్దిలో శనివారం అవగాహన కల్పించారు. కళాకారులు ఎడ్మల శ్రీధర్‌రెడ్డి, శ్రీరాముల రామచంద్రం, గుగ్గిళ్ల పర్శరాములు, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో సర్వే ప్రారంభం కాగా.. కాశితండా, బంజేరు గ్రామాల్లో తహసీల్దార్ మారుతిరెడ్డి ఎన్యుమరేటర్లు సర్వే చేస్తుండగా పరిశీలించారు. ఆర్ఐ సంతోష్ తదితరులున్నారు.

బోయినపల్లి: మండలంలో సర్వే ప్రారంభమైంది. తొలిరోజు 84 మంది ఎన్యుమరేటర్లు 104 బ్లాకుల్లో 299 ఇళ్లలో సర్వే పూర్తి చేసినట్లు ఎంపీడీవో భీమ జయశీల తెలిపారు. నర్సింగాపూర్, విలాసాగర్ తదితర గ్రామాల్లో జెడ్పీ సీఈవో ఎస్.వినోద్ సర్వే తీరును పరిశీలించారు.

గంభీరావుపేట: మండలంలో సర్వే ప్రారంభమైంది. 112 మంది ఎన్యుమరేటర్లు విధులు నిర్వహిస్తున్నారు. దాదాపు 11వేల ఇళ్లకు వెళ్లి సర్వే నిర్వహించనున్నారు.

క్రైం కార్నర్..

రెండు గ్రామాల్లో దొంగతనాలు



బండలింగంపల్లిలో చిందరవందరగా బీరువా

ఎల్లారెడ్డిపేట: బండలింగంపల్లి, దుమాల గ్రామాల్లో గుర్తుతెలియని దొంగలు శుక్రవారం రాత్రి దొంగతనానికి పాల్పడ్డారు. వరుస దొంగతనాలతో మండల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. బండలింగంపల్లికి చెందిన మాచర్ల నర్సయ్య అనే వ్యక్తి తన ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికెళ్లగా.. ఇదే అదునుగా భావించిన దొంగలు ఇంటి తాళాలు పగలగొట్టి లోనికి వెళ్లి వెండి, రూ.7వేల నగదుతో పాటు అప్పు పత్రాలు ఎత్తుకెళ్లారు. జంగా తిరుపతిరెడ్డి ఇంట్లో చొరబడి ఇంట్లోని బీరువాను ధ్వంసం చేసి అందులోని విలువైన వస్తువులను అపహరించారు. దుమాల గ్రామంలోని నర్సింహస్వామి, ఎల్లమ్మ ఆలయాలతోపాటు ఆలయాల పక్కన ఉన్న నవీన్‌కు చెందిన కిరాణ దుకాణం తాళాలు పగలగొట్టి రూ.5వేల నగదు, వస్తువులు ఎత్తుకెళ్లారు. ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారి బంగారు బొట్టు బిళ్లను అపహరించారు. దొంగతనాలపై శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పెద్దమ్మ ఆలయంలో చోరీ

ముస్తాబాద్: మండల కేంద్రంలోని పెద్ద చెరువు వద్ద ఉన్న పెద్దమ్మ ఆలయంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. ఆలయ కమిటీ అధ్యక్షుడు నీరటి సత్యనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆలయం తలుపులు బద్దలుకొట్టి అమ్మవారి పుస్తె, మెట్టెలు, హుండీలోని డబ్బులను దొంగలు ఎత్తుకెళ్లారని పేర్కొన్నారు. సంఘటనా స్థలాన్ని ఎస్సై గణేశ్ పరిశీలించి విచారణ చేపట్టారు.

మట్టి తరలిస్తున్న టిప్పర్ పట్టివేత

ఎల్లారెడ్డిపేట: మండలం నుంచి కామారెడ్డి జిల్లా మాచారెడ్డికి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న టిప్పర్ వాహనాన్ని శనివారం రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. దీంతోపాటు నారాయణపూర్‌కు చెందిన ఓ ఇసుక ట్రాక్టర్ అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా తహసీల్దార్ రామచంద్రం పట్టుకున్నారు. ఈ రెండు వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు.

బాలుడు అదృశ్యం



అశోక్

సిరిసిల్లక్రైం: బీవైనగర్‌లో నివాసముంటున్న మంజల అశోక్(13) అనే బాలుడు మున్సిపల్ పరిధి పెద్దూరులోని బంధువుల ఇంటికెళ్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాలతోపాటు వారి బంధువులకు సమాచారమందించినా ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసులను ఆశ్రయించడంతో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఎవరికైనా కనిపిస్తే ఫోన్ నంబర్ 8712656366కు సమాచారమందించాలని టౌన్ సీఐ కృష్ణ సూచించారు.

ఆలయంలో పని చేయని మేళతాళం



కోనరావుపేట: మామిడిపల్లి శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయంలో భక్తుడు విరాళంగా ఇచ్చిన మేళతాళం పని చేయక 3 నెలలవుతున్నా పట్టించుకోవడం లేదు. దీంతో స్వామివారి సేవలకు ఇబ్బంది కలుగుతోంది. ఉదయం మేలుకొలుపు, హారతి, స్వామివారికి నివేదన సమర్పించే సమయంలో దీన్ని మోగిస్తారు. మూడు నెలల క్రితం మరమ్మతు కోసం మోటార్‌ను తీసుకెళ్లిన అధికారులు ఇప్పటివరకు బిగించలేదు. ఆలయంలో ఉన్న మైక్ చెడిపోగా.. మరమ్మతు కోసం 6 నెలల క్రితం తీసుకెళ్లి ఇప్పటివరకు బిగించలేదు.

ఓటర్ల జాబితా సవరణ సద్వినియోగం చేసుకోవాలి

గంభీరావుపేట: ప్రభుత్వం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని అర్హులైనవారు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ భూపతి కోరారు. 18 ఏళ్లు నిండిన యువత, జనవరి 1, 2025 నాటికి 18 ఏళ్లు నిండేవారు ఓటర్లుగా నమోదు చేసుకోవడానికి వీలుందని తెలిపారు. ఫారం-6 ఓటరు నమోదు కోసం, ఫారం-7 జాబితాలో అభ్యంతరాలకు, ఫారం-8 ద్వారా ఇంటి చిరునామా మార్పు, కొత్త ఎపిక్ కార్డు, దివ్యాంగులుగా గుర్తించడం వంటి సవరణలు చేసుకోవచ్చన్నారు. ఓటరు నమోదు కోసం ఏడాదిలో నాలుగుసార్లు చేసుకోవచ్చని అన్నారు. జనవరి, ఏప్రిల్, జూలై, అక్టోబర్ 1 తేదీల్లో అవకాశముంటుందన్నారు. ఈనెల 10న అన్ని పోలింగ్ కేంద్రాల్లో బూత్ స్థాయి అధికారి అందుబాటులో ఉంటారని తెలిపారు.

ఇల్లంతకుంట: పంచాయతీలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు నమోదు క్యాంపెయిన్‌ను శనివారం తహసీల్దార్ ఎంఏ ఫారుక్ పరిశీలించారు. బీఎల్‌వోలు నర్సయ్య, బి.అరుణ, విజయలక్ష్మి తదితరులున్నారు.



ముస్తాబాద్ జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాల భవనం కిటికీల అద్దాలను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేస్తున్నారు. ఇటీవల సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన అధునాతన తరగతి గదులు ఆకతాయిల చేతిలో ధ్వంసమవుతున్నాయి. డైనింగ్ హాల్ కిటికీల అద్దాలు మొత్తం ధ్వంసమయ్యాయి. దీంతో డైనింగ్ హాల్‌లోకి ప్రవేశిస్తున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
రాజిరెడ్డి, ఎంఈవో, సెల్ నం.: 9866654974

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

భక్తితోనే ముక్తి



శ్రీనంబి వేణుగోపాలాచార్య ప్రవచనం

ఎల్లారెడ్డిపేట: భక్తితో అందరికి ముక్తి లభిస్తుందని, అందరు దేవుడిని కొలిస్తే ఫలితాలు వస్తాయని జగిత్యాలకు చెందిన శ్రీనంబి వేణుగోపాలాచార్య కౌశిక అన్నారు. మండల కేంద్రంలోని సత్సంగ సదనం వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలిరాగా.. వారికి ప్రవచనాలు వినిపించారు. బ్రహ్మచారి లక్ష్మారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండండి

ఇల్లంతకుంట: సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలని ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ మండల ప్రజలకు సూచించారు. శనివారం మాట్లాడుతూ.. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే జరుగుతున్న నేపథ్యంలో అపరిచిత వ్యక్తులు ఆధార్ కార్డు, బ్యాంక్ పాసు పుస్తకం అడిగితే ఇవ్వొద్దన్నారు. ఫోన్ నంబర్, ఓటీపీ చెప్పొద్దని సూచించారు.

వేములవాడ సమాచారం



వేములవాడ రాజన్న సన్నిధిలో శనివారం సాయంత్రం 4 గంటల వరకు వసతి గదుల సమాచారం.

కాంప్లెక్స్ పేరు	ఖాళీల సంఖ్య	అద్దె రూ.
అమ్మవారి కాంప్లెక్స్	05	1,680
భీమేశ్వర సదన్ ఏసీ	06	1,344
భీమేశ్వర సదన్ సూట్స్	07	1,680
భీమేశ్వర గెస్ట్‌హౌస్	05	2,800
నందీశ్వర కాంప్లెక్స్ ఏసీ	06	1,008
నందీశ్వర నాన్‌ఏసీ	07	560
నందీశ్వర సూట్స్	04	2,800
లక్ష్మీగణపతి కాంప్లెక్స్	05	448
పార్వతీపురం స్పెషల్	08	672
పార్వతీపురం సాధారణ	10	336

- వేములవాడ

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

బోయినపల్లి: మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని తెలంగాణ సాంస్కృతిక సారథి పొత్తూరి రాజు ఆధ్వర్యంలో కొదురుపాక గ్రామంలో శనివారం కళా ప్రదర్శనతో ప్రజలకు అవగాహన కల్పించారు. కళాకారులు గడ్డం దేవయ్య, పూడూరు సంజీవ్, అంతడుపుల ఝాన్సీ, లావణ్య, కిన్నెర శ్రీలత, అనుముల శిరీష, పంచాయతీ కార్యదర్శి తదితరులున్నారు.



కొదురుపాకలో కళా ప్రదర్శన

కొనుగోలు కేంద్రాల పరిశీలన

వీర్నపల్లి: మద్దిమల్ల, మద్దిమల్లతండా, బంజేరు, భూక్యతండా, కంచర్ల గ్రామాల్లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం తహసీల్దార్ మారుతిరెడ్డి పరిశీలించారు. తహసీల్దార్ రైతులతో మాట్లాడుతూ.. వరి ధాన్యం తూకంలో ఏమైనా ఇబ్బందులుంటే దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఆర్ఐ సంతోష్, కాంగ్రెస్ నాయకులు, ఐకేపీ సిబ్బంది ఉన్నారు.

ధాన్యాన్ని వెంటనే తరలించాలి

ఎల్లారెడ్డిపేట: వెంకటాపూర్, అగ్రహారం, పదిర గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను శనివారం ఆర్డీవో కె.వెంకట ఉపేందర్‌రెడ్డి పరిశీలించారు. ధాన్యాన్ని త్వరగా మిల్లులకు తరలించాలని సూచించారు. ధాన్యం తరలింపులో ఇబ్బందులు ఉంటే అధికారులకు తెలపాలని రైతులకు చెప్పారు.



భూక్యతండాలో కొనుగోలు కేంద్రం పరిశీలిస్తున్న తహసీల్దార్ మారుతిరెడ్డి

తిమ్మాపూర్ శ్రీసాయి రైస్‌మిల్లు వద్ద సన్నవడ్ల లారీ ఆగి ఉందని రైతులు తెలపగా.. వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడారు. తహసీల్దార్ రామచంద్రం, డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ, ఏఎంసీ చైర్మన్ సాబేర బేగం, వైస్‌ప్రెసిడెంట్ గుండాటి రాంరెడ్డి, డైరెక్టర్ మిండేటి శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, పార్టీ మండలాధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, చెరుకు ఎల్లయ్య ఉన్నారు.

మనవారితో మన మాట కార్యక్రమం

వీర్నపల్లి: మండల కేంద్రంలో మనవారితో మన మాట ఆత్మీయ గోష్టి కార్యక్రమాన్ని తాళ్ల లక్ష్మీరాజం (విశ్రాంత వనాధికారి, యూపీఎఫ్ఎస్, ఉత్తరప్రదేశ్) ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. మండల ప్రగతి కోసం అందరి సహాయ సహకారాలతో రాశిగుట్ట జాతరను నిర్వహించాలని, ప్రకృతి వనరులు, చెరువు, గుట్టలు, వనాలు, తండాలను ప్రకృతి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలన్నారు. గడ్డం దేవయ్య, మాడుగుల మల్లేశం, సామల్ల హన్మయ్య, భూత ఎల్లయ్య, బోయిన్ రవి, మల్లారపు అరుణ్, బోడ ఎల్లయ్య, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



వీర్నపల్లి గ్రామస్తులతో మాట్లాడుతున్న లక్ష్మీరాజం